

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

సన్నబియ్యంతో భోజనం

» విద్యార్థులతో కలిసి జేసీ సహపంక్తి

ఏలూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదివే బాలబాలికలకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా నూతన విద్యాసంవత్సరం నుంచి సన్నబియ్యంతో ఆహారాన్ని వండి, పంపిణీ చేసే ప్రక్రియను గురువారం స్థానిక గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలు, కేపీడీటీ హైస్కూళ్లలో జేసీ ధాత్రిరెడ్డి పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆమె మాట్లాడుతూ ఫైన్ క్వాలిటీ ఫోర్టిఫైడ్ బియ్యాన్ని 25 కేజీల వంతున సంచుల్లో ప్యాక్‌చేసి పాఠశాలలకు సరఫరా చేస్తున్నామన్నారు. జిల్లాలోని 1,768 ప్రభుత్వ పాఠశాలలకు, 145 సంక్షేమ వసతి గృహాలకు సన్నబియ్యాన్ని పంపిణీ చేసినట్టు వివరించారు. ఆహార పదార్థాల నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. డీఎస్‌వో శివరామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవకీదేవి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటప్పయ్య, ఎంఈవో అరుణ్‌కుమార్, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షలకు 46మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన పరీక్షకు స్థానిక సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రంలో ఉదయం షిఫ్టునకు 180 అభ్యర్థులకు 160 మంది, మధ్యాహ్నం షిఫ్టునకు 180 మందికి 173, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 200 మందికి 191, మధ్యాహ్నం 200 మందికి 190 మంది హాజరయ్యారు. మొత్తం 46 మంది గైర్హాజరయ్యారు.

రైతులకు పారదర్శకంగా సేవలు

» సహకార డివిజనల్ రిజిస్ట్రార్ సత్యవతి



ఏలూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సత్వరం పారదర్శకంగా సేవలందించేలా చూస్తానని, సొసైటీలను మెరుగైన రీతిలో ఉంచేందుకు కృషి చేస్తానని ఏలూరు కో-ఆపరేటివ్ డివిజనల్ అధికారి కె.సత్యవతి అన్నారు. ఏలూరు డీఆర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె గురువారం మాట్లాడుతూ జిల్లాలో 2011లో డీఆర్‌డీఏ, మెప్మాల్లో వివిధ హోదాల్లో పనిచేసినట్టు చెప్పారు. 1995లో గ్రూప్-2 ద్వారా అసిస్టెంట్ సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె ఇటీవల బదిలీల్లో కృష్ణా జిల్లా మచిలీపట్నం కేడీసీసీ బ్యాంకు డీఆర్/ఓఎస్‌డీగా పని చేస్తూ బదిలీపై ఇక్కడ విధుల్లో చేరారు.

డీసీవో పోస్టు ఖాళీ...

ఏలూరు జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్ (ఇన్‌చార్జి, డీసీవో) భీమవరం కో-ఆపరేటివ్ డివిజనల్ అధికారిగా బదిలీ అయ్యి రిలీవ్ అయ్యారు. దీంతో డీసీవో పోస్టుకు మళ్లీ ఖాళీ ఏర్పడింది. ఇదిలా ఉండగా ఏలూరు జిల్లా కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారిగా భీమవరం డీఆర్ కె.వెంకటేశ్వరరావు బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

30న షర్మిల భీమవరం రాక

పాలకొల్లు అర్బన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి):పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 30న భీమవరం రానున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాతపాటి హరి కుమార్‌రాజు తెలిపారు. పాలకొల్లు పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు నిర్వహించే సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్య లో హాజరు కావాలని, స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు యడ్ల శివాజీ, నియోజకవర్గ కన్వీనర్ కొరగింజల హరి కిరణ్, బోణం వెంకట్రావు, డాక్టర్ వై.నామగిరి తదితరులు పాల్గొన్నారు.

తల్లి తబ్బిబ్బయ్యేలా..



తల్లికి వందనం అమలుకు ప్రభుత్వ నిర్ణయం



గురువారం నుంచి పాఠశాలలు తెరవడంతో ఏలూరులోని ఈదర సుబ్బమ్మదేవి హైస్కూల్‌లో విద్యార్థినుల ఉత్సాహం

» ప్రతి విద్యార్థికీ రూ.13వేలు వంతున తల్లికి ఆర్థిక సాయం!

» నేటి సాయంత్రంలోగా 1.40 లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు నగదు జమయ్యే అవకాశం

» జిల్లాలో ఇప్పటికి అర్హులైన విద్యార్థులు 2,15,082 మంది

సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన తల్లికి వందనం ఆర్థికసాయాన్ని అందజేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ ప్రారంభించింది. గత ప్రభుత్వంలో మాదిరిగా కుటుంబంలో ఒక విద్యార్థికే ఆర్థిక సాయాన్ని పరిమితం చేయకుండా ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ కుటుంబంలో ఎంతమంది విద్యార్థులున్నా నిబంధనల మేరకు ఈ పథకాన్ని వర్తింపజేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయంతీసుకుని ఆ మేరకు నిధుల విడుదలకు ఆమోదం తెలిపింది. శుక్రవారం సాయంత్రానికి తల్లుల ఖాతాల్లో జమ చేయనున్నారు.

ఏలూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం పక్కదారి పట్టకుండా అర్హులైన వారందరికీ ఆర్థికసాయం అందేలా ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ పథకాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఒకటో తరగతి నుంచి సీని యర్ ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు వర్తింపజేయనుండగా, ప్రస్తుతానికి రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల నుంచి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన తల్లుల సంఖ్య 1,40, 764గా నిర్ధారించి ఒక్కో విద్యార్థికి రూ.15వేలు చొప్పున ఆర్థిక సాయంగా విడుదల చేశారు. ఈ రూ.15 వేలులో స్కూలు శానిటేషన్, మెయింటెనెన్సు నిమిత్తం రూ.2వేలు మినహాయించి తల్లి ఖాతాకు నికరంగా రూ.13వేలు చొప్పున శుక్రవారం సాయంత్రంలోగా జమ చేయాలని నిర్ణయించారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లకు ఉచితవిద్య కింద ఒకటో తరగతిలోకి అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులకు, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు పొందుతున్న విద్యార్థులకు, ట్రిపుల్ ఐటి, పాలిటెక్నిక్ - మిగతా 6వ పేజీలో

సుపరిపాలన.. సంబరాలు



ఎమ్మెల్యే కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్



నూజివీడు పెద్దగాంధీ బొమ్మ సెంటర్‌లో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

» ఎమ్మెల్యేలతో కలిసి కేడర్ ఆనందం

» ఏడాదిలో ఎంతో మార్పు తెచ్చామంటూ నినాదాలు

» ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా సంబరాలు జరిగాయి. నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు కేడర్ సమక్షంలో కేక్ కట్ చేసి ఉత్సాహం ప్రదర్శించారు. ప్రజామన్ననలతో అధికారంలో వచ్చి ఏడాది పూర్తవ్వడంతో తెలుగుదేశం కేడర్ ఇనుమడించిన ఉత్సాహంతో అన్ని చోట్ల కేక్‌లు కట్ చేశారు. భారీ ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయాన్నే ఎన్టీఆర్ విగ్రహాలకు అన్ని చోట్ల పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండుగ వాతావరణం నెలకొనేలా సంబరాలు చేయాల్సిందిగా పార్టీ కేడర్‌కు సంకేతాలందాయి. ఏలూరు నగరంలో ఎమ్మెల్యే బడేటి చంటి నేతృత్వంలో ఆనందం వ్యక్తం చేయగా, ఆయనతో పాటు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ యాదవ్ జత కలిశారు. దీంతో కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేశ్‌లకు అనుకూలంగా నినాదాలు చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం పేదల పక్షాన నిలిచిందని ఇకముందూ ప్రజా సంక్షేమం విషయంలో తొలి వరుసలో నిలుస్తామని ఎంపీ, ఎమ్మెల్యే ప్రకటించారు. నగరానికి చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు పరస్పరం మిఠాయిలు తినిపించుకుని సంతోషం వ్యక్తపరిచారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పెద్ద ఎత్తున కేడర్ వెంట రాగా ఏలూరు నగరంలో ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఏడాది పాటు సుపరిపాలన సాగిందంటూ హర్షం వ్యక్తం చేశారు. దెందులూరు నియోజకవర్గానికి చెందిన పెద్దసంఖ్యలో కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. నూజివీడు నియోజకవర్గంలో మంత్రి పార్థసారథి సైతం వివిధ ప్రభుత్వ కార్య క్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అన్ని విధాలుగా అన్ని వర్గాలను ఆదుకోవడంలో సఫలీకృతమైందని, ఏడాదిలోనే పెనుమార్పులు తీసుకొచ్చామని మంత్రి ప్రకటించారు. అనేకమంది నేతలు, కార్యకర్తలు మంత్రి సారథితో పాటు పార్టీ ముఖ్యులను అభినందనలతో ముంచెత్తారు. చింతలపూడి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సొంగా రోషన్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, అధికార ప్రతినిధి శ్యామ్‌చందర్ శేషుతో పాటు పార్టీ సీనియర్లు ఏడాది సంబరాల్లో భాగంగా కేక్ కట్ చేసి పరస్పరం ఆనందం పంచుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ మండలాల్లో ఈ తరహా సంబరాలే సాగాయి. ఉంగుటూరు నియోజక వర్గంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఎన్టీఆర్, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ముఖ్య కూడలిల్లో ప్రదర్శనగా సాగారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు న్యాయం చేశామని గన్ని వీరాంజనేయులు అన్నారు. కైకలూరు, పోలవరం నియోజకవర్గాల పరిధిలో ఏడాది సంబరాలు ఉత్సాహంగా సాగాయి.



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

శ్రీరామవరం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

దెందులూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : శ్రీరామవరం పంచాయతీ సర్పంచ్ కామిరెడ్డి వెంకట నరసింహారావు(నాని)కి చెక్ పవర్ రద్దు చేస్తున్నట్టు దెందులూరు ఎంపీడీవో కంతేటి శ్రీదేవి తెలిపారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని, ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వుల ప్రకారం చెక్కు డ్రాయింగ్ అధికారాలను ఉపసంహరించినట్టు తెలిపారు. పంచాయతీకి సంబంధించి అన్ని రకాల నిధుల నిర్వహణ, బిల్లుల ఆమోదించే అధికారాలను మండల విస్తరణాధికారికి సూర్య కుమార్ (పీఆర్ఆర్‌డీ)కు కల్పించినట్టు ఎంపీడీవో తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల్లో 69.32 శాతం ఉత్తీర్ణత

» దూరవిద్య పదో తరగతి, ఇంటర్ ఫలితాలు విడుదల

ఏలూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు 69.32శాతం ఉత్తీర్ణత వచ్చింది. పరీక్షలకు మొత్తం 5,766 మంది విద్యార్థులు హాజరుకాగా, వీరిలో 3,997 మంది విజయం సాధించారు. ఉత్తీర్ణుల్లో బాలురు 2,343 మంది (65.45శాతం), బాలికలు 1,654మంది (75.66శాతం) ఉన్నారు. జవాబు పత్రాల రీకౌంటింగ్‌కు సబ్జెక్టుకు రూ.500, రీవెరిఫికేషన్‌కు సబ్జెక్టుకు రూ.1000లను సంబంధిత స్కూలు హెచ్‌ఎం లాగిన్‌ద్వారా ఈ నెల 13నుంచి 19లోగా చెల్లించి, వారి ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ సూచించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ ఉత్తీర్ణత ఇదీ

సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 482 మంది అభ్యాసకులు హాజరుకాగా, వీరిలో 245 మంది (50.83శాతం) ఉత్తీర్ణులయ్యారని డీఈవో వివరించారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 507 మంది హాజరుకాగా 251 మంది (69.23 శాతం) అభ్యాసకులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్ సెంటర్లలో నిర్ణీత రుసుం చెల్లించి ఈ నెల 16 నుంచి 25లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

■ లోపలి పేజీలో..



ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం

» గర్భిణికి కాలపరిమితి ముగిసిన ట్యాబ్లెట్స్

» ఏలూరు జిల్లా ఆస్పత్రిలో నిర్వాకం

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఒకే స్కూలు వద్దు..

» కొందరు ఉపాధ్యాయ దంపతుల అయిష్టత

» ఎస్జీటీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో విచిత్రం

» స్పౌజ్ నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేయలేమంటున్న విద్యాశాఖ

ఏలూరు అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ దంపతులిద్దరూ ఒకేచోట ఉద్యోగవిధులుంటే ఎంతో సంతోషిస్తారు. చాలామంది ఇదే కోరుకుంటారు. రికమండేషన్లు తెచ్చుకుంటారు. తెలిసిన వారితో సిఫారసు చేయించుకుంటారు. దీనికి భిన్నంగా ప్రస్తుతం జరుగుతోన్న ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో స్పౌజ్ పాయింట్లతో దరఖాస్తు చేసుకున్న టీచర్లలో కొందరు తమ జీవితభాగస్వామి పనిచేస్తు న్న పాఠశాలలో వెకెన్సీ ఉన్నప్పటికీ అక్కడకు బదిలీ కోరుకునేందుకు లేదా ఐచ్ఛికాన్ని ఇచ్చేందుకు అయిష్టత చూపిస్తుండడం అటు విద్యాశాఖవర్గాలు, ఇటు మిగతా ఉపాధ్యాయ వర్గాలు ముక్కున వేలేసుకుంటున్నాయి. కొద్ది రోజులుగా జరుగుతోన్న ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌లో భాగంగా తొలుత జరిగిన బదిలీల్లో స్పౌజ్ పాయింట్లతో బదిలీకి దరఖాస్తు చేసుకున్న వారిలో పలువురు ఆయా వెకెన్సీలను నిబంధనలకు విరుద్ధంగా కోరుకున్నారని విమర్శలు వస్తుండగానే, తాజాగా జరుగుతున్న మాన్యువల్ కౌన్సెలింగ్‌లో స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు వెకెన్సీలను కోరుకునే విషయంలో పలువురు నుంచి అభ్యంతరాలు రావడం గమనార్హం. నిబంధనల ప్రకారం స్పౌజ్ పాయింట్లతో బదిలీ కోరుకునే టీచర్లలో జీవిత భాగస్వామి ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలలోనే వెకెన్సీఉంటే తొలి ప్రాధాన్యతగా అదే స్థానానికి ఐచ్ఛికాన్ని ఇచ్చి కోరుకోవాల్సి ఉంటుంది. అక్కడ వెకెన్సీ లేకపోతే సమీప స్కూలు లేదా ప్రాంతం లేదా అదే మండలం...ఇలా ప్రాధాన్యతా క్రమంలో పాఠశాలను ఎంచుకోవాలి. కానీ గురువారం జరిగిన ఎస్జీటీల బదిలీల్లో పలువురు స్పౌజ్ పాయింట్లను వినియోగించుకుంటూనే జీవితభాగస్వామి పనిచేస్తున్న స్కూలులో వెకెన్సీ ఉన్నప్పటికీ ఐచ్ఛికాన్ని ఇవ్వకుండా సమీప ప్రాంతాల్లోని పాఠశాలలను ఎంచుకోవడంతో చర్చకు దారి తీసింది. ఇలా నిబంధనలకు విరుద్ధంగా వెకెన్సీలను ఖరారు చేయలేమంటూ విద్యాశాఖ వర్గాలు తిరస్కరించగా, పలువురు ఉపాధ్యాయులు మద్దతుగా నిలవడం గమనార్హం. స్పౌజ్ పాయింట్లతో బదిలీ కోరుకున్నవారికి జీవిత భాగస్వామి పనిచేస్తున్న స్కూలుకు లేదా సమీప స్కూలుకు ఐచ్ఛికాన్ని ఇచ్చుకునేలా ఉపాధ్యాయ సంఘాలు, విద్యాశాఖ శ్రమించాల్సి వచ్చింది. అయితే స్పౌజ్ ఉపాధ్యాయ దంపతుల వాదన మరోలాఉంది. ఒకే స్కూలులో దంపతులిద్దరూ ఉంటే సెలవుకు దరఖాస్తు చేసుకోవడానికి ఇద్దరికీ ఒకేసారి అవకాశం ఉండబోదని, ఈ పరిస్థితి ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు, ముగ్గురు పని చేసే టీచర్లున్న చోట స్పష్టంగా కన బడుతుందని చెబుతున్నారు. ఈ సాంకేతిక అవరోధాలను అధిగమించేందుకే వేర్వేరు స్కూళ్లను ఎంపిక చేసుకోవాల్సి వస్తోందని వారు తమ చర్యలను సమర్థించుకుంటున్నారు.

ప్రశాంతంగా ఎస్జీటీల కౌన్సెలింగ్

ఉమ్మడిజిల్లా ఎస్జీటీలకు స్థానిక జడ్పీ మీటింగ్ హాలులో జరుగుతున్న మాన్యువల్ కౌన్సెలింగ్ గురువారం ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జరుగుతోంది. రెండోరోజు మొత్తం 900 మందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తుండగా, రాత్రి 10 గంటల సమయానికి 776 సీనియార్టీ నంబరు వరకు పూర్తయింది. కాగా శుక్రవారం మరో 800 మంది ఎస్జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. కాకినాడ ఆర్జేడీ నాగమణి కౌన్సెలింగ్ తీరును పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం : ఎంపీ



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్క రించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పామాయిల్ రైతులు తమ సమస్యలు వివరించారు.

నేడు యోగాంధ్ర స్టూడెంట్స్ థీమ్



యోగాంధ్ర ఏర్పాట్లపై ఆర్డీవోతో చర్చిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సర్ సీఆర్ ఆర్ రెడ్డి కళాశాల గ్రౌండ్స్‌లో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 13న ఉదయం 6.30 గంటలకు స్టూడెంట్స్ యోగాభ్యాసన కార్యక్రమం 8వేల మందితో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను కోరారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించిన ఆమె కళాశాల ప్రాంగణంలో ఏర్పాట్లపై ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, ఇతర అధికారులతో పరిశీలించారు. యోగాంధ్రలో 8లక్షల 26వేల9651 మంది ప్రజలు నమోదు కావడం శుభ పరిణామమన్నారు. జిల్లాలో 14న యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలన్నారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, సీపీవో వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

బడి గంట మోగింది

ఉత్సాహంగా పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు



వేసవి సెలవుల అనంతరం ఏలూరులో పాఠశాలలకు పరుగెత్తుతున్న విద్యార్థులు



ఏలూరు ఈదర సుబ్బమ్మ పాఠశాలలో ఉదయం అసెంబ్లీలో విద్యార్థుల ప్రార్థన











వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం తిరిగి తెరుచుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. మంచి రోజు కూడా కలిసి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 50 శాతం పైగా విద్యార్థులు తొలిరోజు తరగతులకు హాజరయ్యారు. సైకిల్, ఆటో, బస్సులలో విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. సెలవుల అనంతరం కలుసుకున్న స్నేహితులు ముచ్చట్లలో మునిగిపోయారు. అంగన్‌వాడీల్లో గురువారం ప్రవేశాలు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులకు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం ఇవ్వడంతో పాటు విద్యా సామగ్రి, పుస్తకాలు అందజేశారు. - ఫొటోగ్రాఫర్ / ఏలూరు



మంత్రి అచ్చెన్నాయుడు నుంచి అవార్డు అందుకుంటున్న చందు

చందుకు ఉత్తమ రైతు పురస్కారం

మొగల్తూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రామన్నపాలెం గ్రామానికి చెందిన అయితం రాన్ చందు మంత్రి అచ్చెంనాయుడు నుంచి ఉత్తమ రైతు అవార్డును గురువారం అందుకున్నారు. సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలంబించడంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి డాక్టర్ ఎంవీ.రెడ్డి ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం 61వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కృష్ణ ఆడిటోరియంలో అవార్డుతో పాటు రూ.25వేలు నగదు, జ్ఞాపిక, ధ్రువపత్రం అందుకున్నారు. పలువురు ప్రజా ప్రజాప్రతినిధులు, రైతులు చందును అభినందించారు.

అగ్రిగోల్డ్ డిపాజిట్ల సొమ్ము ఇప్పించండి

భీమవరం అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు బలైపోయిన లక్షలాది మంది కస్టమర్లు, ఏజెంట్లకు సొమ్ములు ఇప్పించాలని, బాధితుల కేసులను వాదించడానికి ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటు చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండ్ చేశారు. తణుకులో ఈనెల 15న నిర్వహించే సమావేశం నిర్వస్తున్నట్లు గురువారం ఆయన తెలిపారు. అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం కోట్ల రూపాయలు సేకరించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనాల భీమారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ఫలితంగా కంటి తుడుపుగా రూ.10 వేలు, రూ.20 వేలు పరిహారం చెల్లించారని, ఇంకా లక్షల్లో బాధితులున్నారని గుర్తుచేశారు. ఎం.సీతారాంప్రసాద్, కె.గోపాలకృష్ణ, చెల్లబోయిన రంగారావు, ఎన్.పల్లయ్య, ఏవీ రాంబాబు, పి.నరసింహాచారి, జె.వెంకటేశ్వరరావు, ఎం.సాయిబాబు, వై.వీరకృష్ణ పాల్గొన్నారు.

వైద్య సేవలందించే గౌరవ డాక్టర్

అలంపురం ట్రస్టు ఆసుపత్రి చైర్మన్ కృష్ణంరాజుకు డాక్టరేట్



పెంటపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆయన సాధారణ రైతు. ప్రతి నిత్యం వేల మంది పేదలకు వైద్య సేవలందిస్తారు. అలంపురంలో వెంకట రమణ సేవా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటుచేసి వివిధ ప్రాంతాల నుంచి వైద్య నిపుణులను తీసుకువచ్చి పేదలకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. ఆయనే కొలనువాడ పెదకృష్ణంరాజు. ఆయన సేవలను గుర్తించిన న్యూఢిల్లీలోని సోక్రటీస్ సోసల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. 2015లో పేదల కోసం ట్రస్టు ఆసుపత్రిని ఏర్పాటుచేసి అప్పటి నుండి నిరంతరాయంగా వైద్య సేవలు అందిస్తూనే ఉన్నారు. ప్రతీ వారం ప్రత్యేక వైద్యులతో ఖరీదైన వైద్య సేవలను పేదలకు ఉచితంగా అందజేస్తున్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలో 51 వేల మంది రోగులు ఈ ఆసుపత్రిలో శాశ్వత ఓపీ నమోదు చేసుకున్నారు. వారికి ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా ట్రస్ట్ ఆసుపత్రికి వెళతారు. అద్దెభవనంలో ప్రారంభమైన వైద్య సేవలు ప్రస్తుతం అలంపురంలో రెండు నూతన భవనాలలో కొనసాగుతున్నాయి. నాలుగున్నర ఎకరాలలో ఆసుపత్రి, వృద్ధాశ్రమం, వేంకటేశ్వరస్వామి ఆలయం, సత్రం ఏర్పాటు చేయడానికి నిర్మాణ పనులు చేపట్టారు. ఈ నెల 21న ఢిల్లీలో పెద కృష్ణంరాజుకు డాక్టరేట్ అందుకోనున్నారు. చైర్మన్ పెదకృష్ణంరాజు మాట్లాడుతూ డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో తమ ట్రస్టు ద్వారా పేదలకు మరిన్ని సేవలు అందిస్తామని, ఆ దిశగా ఏర్పాట్లు చేశామన్నారు



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ఏలూరుసిటీ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జడ్పీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ గురువారం పాలాభిషేకం చేశారు. కేక్ కట్‌చేసి వేడుకలను నిర్వహించారు. జడ్పీ సీఈవో కె.భీమేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట

- డివిజన్ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలోకి
- ఏర్పాట్లపై కలెక్టర్, జడ్పీ సీఈవోలకు ఆదేశాలు



ఏలూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్‌లో సంస్కరణల పర్వం కొనసాగుతోంది. అన్ని కార్యాలయాలకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నారు. డివిజనల్ పంచాయతీ అధికారి, ఉపాధి హామీ పథకం ఏపీడీ, డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు (డీడీఎల్‌వో)లు ఒకేచోట ఏర్పాటు కానున్నాయి. జూన్ 12లోగా ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు నిర్వహించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గతంలో అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. తాజాగా మూడు కార్యాలయాలు ఒకేచోట ఉండేలా కలెక్టర్ల పర్యవేక్షణలో జడ్పీ సీఈవోలు నిర్మాణ పనులు, ఇతర ఏర్పాట్లు చేయాలని ఉన్నతాధికారులు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఏలూరు డివిజన్‌కు సంబంధించి అమీనాపేట మీసేవ సెంటర్ ప్రాంగణం, జంగారెడ్డి గూడెం డివిజన్‌కు అశ్వారావుపేట రోడ్డులోని పాత ఎస్టీ హాస్టల్ ప్రాంగణం, నూజివీడు డివిజన్‌కు ఎస్‌ఆర్‌ఆర్ బాలుర జడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఈ మూడు కార్యాలయాలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం డివిజన్‌కు భీమవరం కలెక్టరేట్ సమీపంలోని మారుతీనగర్ వద్ద, తాడేపల్లిగూడెం ఎంపీడీవో కార్యాలయం, నరసాపురం డివిజన్‌కు 24వ వార్డు కప్పొలపేట వద్ద డీఎల్‌డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేయనున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో నిర్లక్ష్యం

- గర్భిణికి కాల పరిమితి ముగిసిన ట్యాబ్లెట్స్
- ఏలూరు జిల్లా ఆస్పత్రిలో నిర్వాకం



గడువుతీరిన డాక్సిలామైన్ సక్సినేట్ టాబ్లెట్స్

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యసేవలపై ప్రజల్లో వ్యతిరేకత ఉంది. వైద్యవిధాన పరిషత్‌లో ఉన్నప్పుడు ఉత్తమ సేవలతో జాతీయ స్థాయిలో రెండు పర్యాయాలు అవార్డులు అందుకుంది. మెడికల్ కాలేజీ టీచింగ్ ఆసుపత్రిగా మారిన తరువాత సేవలు అథమ స్థాయికి చేరుకున్నాయని విమర్శలు వస్తున్నాయి. వైద్యసేవలు ఎలా ఉన్నా మందులు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఒక గర్భిణికి గడువు ముగిసిన మందులను ఇవ్వడంతో అవాక్కైంది. బిడ్డ, తల్లి ప్రాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏలూరు రూరల్ మండలం పాలగూడెం గ్రామానికి చెందిన భవాని మూడు నెలల గర్భిణి. కుటుంబ సభ్యులు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రి తల్లి బిడ్డల విభాగంలో వైద్య సేవల కోసం తీసుకువచ్చారు. ఈనెల 10న జనరల్ చెకప్ చేసి వివిధ ల్యాబ్ పరీక్షలను కూడా చేశారు. ఆ పరీక్షలను ఈనెల 11న తీసుకుని తిరిగి వైద్యుల వద్దకు వెళ్లగా ఆమెకు మందులు రాయడంతో అదే భవనంలో ఉన్న ఫార్మసీ కౌంటర్‌లో ఉదయం మందులు తీసుకున్నారు. మొత్తం నాలుగు రకాల మందులు రాయగా వాటిలో డాక్సిలామైన్ సక్సినేట్ (నిద్రపట్టడానికి వాడేవి) టాబ్లెట్స్‌పై కాలపరిమితి 2025 మే వరకూ మాత్రమే ఉంది. వాటిని గర్భిణికి పంపిణీ చేశారు. భవానీ కుటుంబ సభ్యులు ఆమెకు టాబ్లెట్స్ వేసే ముందు గడువు తేదీ చూసి కంగారుపడ్డారు. చూడకుండా వేసుకుంటే తల్లి బిడ్డ పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేశారు. తమతో పాటు ఈ మాత్రలు ఎంత మందికి ఇచ్చారో.. వాళ్ల పరిస్థితి ఏమవుతుందో ఏమిటోనంటూ ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని మీడియా దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శశిధర్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని శుక్రవారం ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సాధారణంగా ఎక్స్‌పైరీ అయిన టాబ్లెట్స్‌ను ముందుగానే తీసి వేస్తారని కాని డిస్పెన్సరీకి ఎవరు ఇచ్చారు. అక్కడ నుంచి పంపిణీ ఎలా జరిగాయి అనే దానిపై పూర్తిస్థాయి విచారణ చేసి చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారు.

లారీ బోల్తా : డ్రైవర్ మృతి



పాలవాగు వద్ద బోల్తా కొట్టిన లారీ

కుక్కునూరు, జూన్12 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు భద్రాచలం ప్రధాన రహదారిలో పాలవాగు వద్ద జరిగిన ప్రమాదంలో లారీ బోల్తా పడడంతో డ్రైవర్ చరణ్‌ప్రీత్ సింగ్ (50) మృతి చెందాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు చెన్నై నుంచి రాయ్‌పూర్‌కు డోజర్‌తో క్యాట్ వెహికల్ వెళుతుండగా పాలవాగు వద్ద అదుపు తప్పిన లారీ బోల్తాపడింది. డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానికుల సాయంతో డ్రైవర్ మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడు రాయ్‌పూర్‌కు చెందినవాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొవ్వలి అడ్డరోడ్డు సమీపంలో..

దెందులూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కొవ్వలి అడ్డరోడ్డు సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పెదవేగి సీఐ రాజశేఖర్, దెందులూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు.

కారు.. లారీ ఢీకొని..

పాలకొల్లు టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు కుంపట్ల రామ్‌గోపాల్ (41) గురువారం రోడ్డు ప్రమాదంలో మరణించారు. రామ్‌గోపాల్ కుటుంబంతో కలిసి హైదరాబాద్ వెళ్లి పాలకొల్లు తిరిగి వస్తున్నారు. కృష్ణా జిల్లా కృత్తివెన్నులో కారు-లారీ ఢీకొనడంతో రామ్‌గోపాల్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఆయన భార్య కుమారిని భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆయన కుమారుడు, కుమార్తెకు స్వల్ప గాయాలయ్యాయి. మంచివాడుగా పేరొందిన రామ్‌గోపాల్ మృతితో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మోటారు సైకిళ్లు ఢీకొని..

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో గాయపడిన వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. నూజివీడు మండలం వెస్ట్ దిగవల్లి గ్రామానికి చెందిన కావూరి కోటయ్య (52) మోటారు సైకిల్‌పై వెళుతుండగా ఏలూరు-చింతలపూడి మార్గంలో వలసపల్లి అడ్డరోడ్డు వద్ద ఎదురుగా మోటారు సైకిల్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన కోటయ్యను ధర్మాజీగూడెం పీహెచ్‌సీకి అనంతరం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యులు పరీక్షించి అప్పటికే కోటయ్య మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గోదావరిలో మత్స్యకారుడి మృతి

నరసాపురం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): గోదావరిలో వేటకు వెళ్లిన మత్స్యకారుడు ఎన్ రాంబాబు(45) గురువారం మృతి చెందాడు. తెల్లవారుజామున వేటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మత్స్యకారులు గోదావరిలో గాలించగా బోట్లు నిలిచే ప్రదేశంలో మృతదేహం వల చుట్టుకుని కనిపించింది. మత్స్యకారులు తాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రభుత్వ విప్ నాయకర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చెట్టు కొమ్మ విరిగిపడి..

నరసాపురం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన ఎ.సర్వేశ్వరరావు(54) చెట్టు కొమ్మ విరిగిపడడంతో గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈనెల 9న అల్లు సర్వేశ్వరరావు, మరో ఇద్దరు తన ఇంటి సమీపంలో మామిడికాయాల కోస్తుండంగా చెట్టు కొమ్మ విరిగి కిందికి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన సర్వేశ్వరరావును భీమవరం ప్రైవేట్ ఆస్పత్రికి అక్కడి నుంచి విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. దీనిపై ఆయన కుమారుడు రాహుల్‌సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట సురేష్ చెప్పారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగిన గొడవతో మనస్తాపం చెందిన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చోడిదిబ్బ ప్రాంతానికి చెందిన ప్రగడ నాగేంద్ర (24) తనతో పని చేసే రాము, శ్రీపద్రు సాయికి ఈ నెల 10న రాత్రి మద్యం ఇప్పించాడు. ఆ సమయంలో వారి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో రాము అక్కడ ఉన్న వస్తువుతో నాగేంద్ర తలపై కొట్టడంతో తలకు చిన్న దెబ్బతగిలింది. బుధవారం రాత్రి ఏలూరు టూ టౌన్ పోలీసులు నాగేంద్ర ఇంటికి వచ్చి రౌతు రాము కేసు పెట్టాడని ఉదయాన్నే స్టేషన్‌కు రావాలని చెప్పి వెళ్లారు. తాను ఇప్పించిన మద్యం తాగి తనపైనే కేసు పెట్టారని మనస్తాపానికి గురైన నాగేంద్ర ఇంట్లో చున్నీతో ఉరి వేసుకున్నాడు. గమనించిన తల్లి ఇరుగు పొరుగు సహకారంతో కింది దించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



విద్యుత్ స్తంభంపై మృతదేహం (ఇన్‌సెట్) మదిరి నవీన్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం,జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న యువకుడు విద్యుదాఘాతంతో స్తంభంపైనే మృతి చెందాడు. నెల్లూరు జిల్లా భీమవరప్పాడుకు చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ కొమ్మి మన్మధ శేఖర్ వద్ద కృష్ణాజిల్లా చంద్రాల గ్రామానికి చెందిన మదిరి నవీన్ (26) పని చేస్తున్నాడు. మైసన్న గూడెంలో పలు విద్యుత్ లైన్ల పనులు చేస్తున్నారు. గురువారం నవీన్‌తో పాటు మరో ఇద్దరు పనులు పూర్తి చేసుకుని తిరిగి వెళుతున్నారు. అదే సమయంలో మైసన్నగూడెం లైన్‌మన్ యాదాల సురేష్ వచ్చి స్తంభంపై చిన్న పని ఉందని నవీన్‌ను తీసుకువెళ్లగా మిగిలిన ఇద్దరు జంగారెడ్డిగూడెం వెళ్లిపోయారు. 11 కేవీ హెచ్‌టి విద్యుత్ స్తంభంపై నవీన్ పని చేస్తుండగా ఒక్కసారిగా విద్యుదాఘాతంతో స్తంభం పైనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏడీఈ సుబ్బారావు, ఎస్సై ఎస్‌కే.జబీర్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏడీఈ సుబ్బారావు మాట్లాడుతూ మరమ్మతుల నిమిత్తం ఎల్‌సి తీసుకున్నారని, దగ్గరలో ఇళ్లకు వెళ్లిన సరఫరా రిటన్‌తో ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక అంచనాలో నిర్ధారణకు వచ్చామన్నారు.

భవన నిర్మాణ పనుల్లో ఉండగా..

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కొత్తూరులో భవన నిర్మాణ పనిలో విద్యుత్ వైరు తగిలి యువకుడు మృతి చెందాడు. దార్లంక మునేశ్వరరావు (నాని) (35) గురువారం తాపీ పనిచేస్తుండగా విద్యుత్ వైరు కాలికి తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నాని అవివాహితుడు. తండ్రి విష్ణు దుబాయ్ వెళ్లగా తల్లితో నవాబుపాలెంలో ఉంటున్నాడు. తల్లి ఫిర్యాదుతో ఎస్సై ప్రసాద్ కేసు నమోదు చేశారు.

రైలు పట్టాలపై యువకుడు

ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు

భీమవరం క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): గునుపూడికి చెందిన అంజి (22) క్షణికావేశంలో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నం చేయబోయాడు. వన్‌టౌన్ సీఐ నాగరాజుకు ఫోన్ కాల్ ద్వారా సమాచారం అందడంతో తక్షణమే స్పందించి హెడ్ కానిస్టేబుల్ శేషావతారం, కానిస్టేబుల్ జయరాజును సంఘటనా స్థలానికి పంపించారు. కొద్ది నిముషాల్లోనే వారు రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. యువకుడు ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న కీలక సమయంలో అతడిని అదుపులోకి తీసుకుని కాపాడారు. అనంతరం యువకుడికి అవసరమైన మానసిక మద్దతును అందించి బంధువులకు అప్పగించారు. త్వరితగతిన స్పందించిన వన్‌టౌన్ పోలీసు అధికారులు, సిబ్బందికి సదరు యువకుడి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసుల్లో..

ఆరుగురి అరెస్టు

ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం సరిహద్దు విషయమై రెండు వర్గాలు గొడవ పడ్డారు. నడిరోడ్డుపై కత్తులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పారావు కేసు నమోదు చేసి రెండు కేసుల్లో ఆరుగురిని గురువారం అరెస్టు చేశారు. ఫిరంగుల దిబ్బ ప్రాంతానికి చెందిన కగ్గా వెంకటేశ్వరరావు, ఇబ్బా వెంకటేశ్వరరావుకు ఇంటి సరిహద్దు గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో 10న రెండు వర్గాలు ఇంటి వద్ద ఘర్షణ పడి అనంతరం ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసర్ ఎదురుగా ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సంఘటనపై రెండు వైపుల ఫిర్యాదులపై పోలీసులు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. కగ్గా వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో ఇబ్బా నాగరాజు, వరప్రసాద్‌ను అరెస్టు చేశారు. దారం దావీదు రాజు ఫిర్యాదుతో యడవల్లి బాలాజీ, కర్నాటి వెంకట త్రినాథ్, నక్కా వెంకట రమణ, యడవల్లి నాగలక్ష్మిని అరెస్టుచేసి ఏలూరులోని కోర్టుకు హాజరిచారు. కోర్టు వారికి పర్యగా 14 రోజులు రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

అదనపు కట్నం వేధింపులు

ఆచంట, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన వీరమల్లు లక్ష్మీదుర్గను భర్త, అతడి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, గాయపరిచాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదుర్గ తండ్రి పంది లక్ష్మీనారాయణ గురువారం ఆచంట పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మీదుర్గ పుట్టుకతో చెవిటి, మూగ. 2014లో వీరమల్లు నాగరాజుతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.1.5 లక్షల కట్నం, బంగారు వస్తువులు, సారె ముట్టజెప్పారు. నాగరాజు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. భార్యను అదనంగా రూ.2 లక్షలు తీసుకు రావాలని వేధిస్తున్నాడు. భర్తతోపాటు కుటుంబ సభ్యులు వీరమల్లు మనేనమ్మ, వెంకటేశ్వరరావు, దుర్గాప్రసాద్ మే నెల 20న లక్ష్మీదుర్గను కొట్టి గాయపరిచినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త, అత్త వేధింపులు..

భీమవరం క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తన భర్త, అత్త, చిన్నత్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన కాకుమాను కృష్ణమణి టూటౌన్ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. కృష్ణమణికి విజయవాడకు చెందిన ప్రేమ్‌కుమార్‌తో 2024లో వివాహమైంది. కొంత కాలం బాగానే చూసుకున్నాడు. అనంతరం వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను సరిగ్గా చూడడం లేదని వాపోయింది. అదనంగా రూ. 5 లక్షలు కట్నం తెమ్మని వేధించడంతో ఆమె పుట్టింటికి చేరుకుంది. గురువారం భర్త ప్రేమ్‌కుమార్, అత్త, అత్త చెల్లెలిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

ప్రతి మహిళ ఫోన్‌లో శక్తియాప్ ఉండాలి

ఏలూరు క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ మొబైల్లో శక్తియాప్ ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కాంతి ప్రియలు అన్నారు. ఏలూరు నగరంలో మహిళలకు, యువతులకు శక్తి యాప్‌పై గురువారం రాత్రి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రమాదకరమైన పరిస్థితుల్లో పోలీస్ సాయం పొందాలనుకుంటే శక్తి యాప్‌లోని ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే పది నిముషాల్లోపు పోలీసులు వస్తారన్నారు. మహిళలు యాప్‌పై అవగాహన పెంచుకుని తమకు రక్షణగా ఉపయోగించుకోవాలని సూచించారు.

ఎంపీకి ఆయిల్ పాం రైతుల విజ్ఞప్తి

జీలుగుమిల్లి: పామాయిల్ పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని నవభారత్ పామాయిల్ గ్రోయర్స్ అసోసియేషన్ తరఫున రైతులు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్‌ను కలిశారు. ఎంపీ క్యాంపు కార్యాలయం వద్ద పామాయిల్ టన్నుకు రూ.20 వేలు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చెయ్యాలని విన్నవించారు.



ఎంపీతో ఆయిల్‌పాం రైతులు

కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఏలూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. గురువారం ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, జిల్లా కార్యదర్శి కె.బుచ్చిబాబు, జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, పుప్పాల కన్నబాబు, పి.కిశోర్, అప్పలరాజు, యు.హేమశంకర్, నాయకులు బి.ఎ.యోహాను పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

ఉంగుటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సమస్యలను రాతపూర్వకంగా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ అన్నారు. గురువారం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఉంగుటూరు మండల పరిషత్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాలల పునః ప్రారంభం నేపథ్యంలో నూతన భవనాల నిర్మాణం విషయంలో అశ్రద్ధ వద్దన్నారు. ఎర్రచెర్వును యథేచ్ఛగా తవ్వేస్తున్నారని ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణ, కాకర్లమూడి శివారు తోట రామచంద్రాపురంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఉప సర్పంచ్ కూనా రాజు సమస్యలపై చర్చించారు. వర్మి కంపోస్టు ఎరువుల అమ్మకాలను యాప్ ద్వారా నిర్వహించాలని చేబ్రోలు సర్పంచ్ రాందే లక్ష్మీ సునీత పేర్కొన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

అభినయ నృత్యభారతి చిన్నారుల ప్రదర్శన

ఏలూరు రూరల్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అభినయ నృత్యభారతి 30వ వసంతాల వేడుకల్లో భాగంగా నాట్యాచార్య లయన్ హేమసుందర్ శిష్య బృందం జూన్ 7వ తేదీ నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లాలో ఉన్న ప్రముఖ ఆలయాల్లో ముఖ్య ప్రదర్శనలు చేసి ఆకట్టుకున్నారు. విజయనగరం జిల్లాలోని ప్రముఖ ఆలయాల్లో మూడ్రోజుల పాటు నృత్య ప్రదర్శన నిర్వహించగా 10న గ్రామ ప్రజల ఆధ్వర్యంలో హేమసుందర్‌కు ఘనంగా గురుసత్కరించి, చిన్నారులకు జ్ఞాపికలు అందించారు.

దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అఖిల భారత దివ్యాంగుల హక్కులు వేదిక(ఏఐడీఆర్ఎఫ్) జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు నిర్వహించిన ఆత్మగౌరవ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ దివ్యాంగులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించి పంచాయతీల్లో కోఆప్షన్ పదవి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 8 లక్షల మంది దివ్యాంగులున్నారని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఏఐడీఆర్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా పాల వెంకట రమణ నియమించి నియామకపత్రం అందజేశారు. పాల వెంకటరమణ మాట్లాడుతూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

ఉంగుటూరులో సీసీ రోడ్డు ప్రారంభం



ఉంగుటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): కూటమి నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం గ్రామీణ సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం ఉంగుటూరు కాల్వగట్టు వెంబడి నాచుగుంటవం తెన వరకు రూ.55 లక్షలతో నిర్మించిన సి.సి.రహదారిని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ బండారు సింధు మధు, మార్కెట్ కమిటీ చైర్మన్ భర్త సూరత్తుల అయ్యప్ప, ఎంపీడీవో జి.రాజ్ మనోజ్, పంచాయతీరాజ్ ఏ.ఈ.కృష్ణ మోహన్, ఈవోపీఆర్డీ చంద్రశేఖరన్ పాల్గొన్నారు.

శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలి

పెదపాడు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా జాగ్రత్త వహించాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలకు సూచించారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్ ప్రసాద్ ఆధ్వర్యంలో వలస వ్యవసాయ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవనోపాధి, ప్రస్తుత వారి జీవన ప్రమాణాలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వలస కూలీల భద్రత, వారి హక్కుల పరిరక్షణకు జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని హామీనిచ్చారు. పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధి కోసం రుణాల అందజేత

లింగపాలెం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధి కోసం కిసాన్ సమృద్ధి పథకం ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నట్టు ఎస్‌బీఐ ఏలూరు రీజనల్ మేనేజర్ పక్కల కాళిదాసు తెలిపారు. ధర్మాజీగూడెం స్టేట్ బ్యాంక్‌లో బ్యాంక్ మేనేజర్ పి.రజనీకాంత్ ఆధ్వర్యంలో వ్యవసాయ రుణమేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళిదాసు మాట్లాడుతూ అధునిక పద్ధతుల్లో డ్రోన్లు, పవర్ టిల్లర్స్, హార్వెస్టర్ లాంటి అధునిక వ్యయసాయ పనిముట్ల కోసం స్టేట్ బ్యాంక్ రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. గతంలో రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని కోరారు. అసిస్టెంట్ మేనేజర్ ఆర్ జ్యోతి, ఫీల్డ్ ఆఫీసర్ మహమ్మద్ ఇమ్రాన్, రూరల్ రిలేషన్ షిప్ మేనేజర్ నిర్మలబాబు పాల్గొన్నారు.

భద్రాచలానికి కొత్త సర్వీసు ప్రారంభం

ఏలూరు క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఏలూరు డిపో నుంచి భద్రాచలానికి సరికొత్త సర్వీసును 13వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రయాణికుల కోరిక మేరకు ఈ బస్సు సర్వీసు భీమవరంలో రాత్రి 8 గంటలకు బయల్దేరి ఏలూరు 10 గంటలకు చేరుకుని అక్కడి నుంచి భద్రాచలం రాత్రి 2.45 గంటలకు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం భద్రాచలంలో ఉదయం 8 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం ఒంటి గంటకు ఏలూరుకు, భీమవరం 3 గంటలకు చేరుకుంటుందన్నారు. ఈ బస్సును ఏలూరులో ఉదయం 10 గంటలకు ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి, విజయవాడ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడులు ప్రారంభిస్తారని తెలిపారు.

సబ్సిడీతో రైతుకు రెండు డ్రోన్లు అందజేత

జంగారెడ్డిగూడెం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయాధికారి పోశారావు ఆధ్వర్యంలో పంగిడిగూడెం రైతులకు 80 శాతం సబ్సిడీతో రూ.పది లక్షల విలువైన రెండు డ్రోన్లు అందజేశారు. సబ్సిడీతో రైతులకు ఇచ్చిన డ్రోన్లు అవసరమైన రైతులకు తగిన రుసుం చెల్లించి పొలాల్లో పురుగు మందులు పిచికారి చేయించుకోవచ్చన్నారు. దీంతో సమయం ఆదా అవుతుందన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, ముళ్ళపూడి శ్రీనివాస్, గంటా శ్రీనివాస్, గంటా రామారావు, ప్రసాద్, నూనె పల్లారావు, నాగ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తల్లి తబ్బిబ్బయ్యేలా..

(మూడో పేజీ తరువాయి)

విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. తల్లికి వందనం ఆర్థిక సాయానికి ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలతో పాటు, అన్ని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల సంఖ్య 2,15,082గా ధ్రువపడింది.తల్లుల సంఖ్య 1,40,764గా తేల్చారు. ఇప్పుడు ఆర్థికసాయానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన తల్లుల సంఖ్యను సచివాలయాలు గుర్తించాల్సి ఉంటుంది. మరోవైపు ఒకటో తరగతిలోకి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోకి అడ్మి షన్లు తీసుకున్న విద్యార్థుల సంఖ్యను తల్లికి వందనం పథకా నికి జోడించాల్సిఉంటుంది. ఈ రెండు తరగతుల్లోకి ఈ ఏడాది జరిగే అడ్మిషన్ల సంఖ్య దాదాపు 35వేల వరకు ఉండవచ్చని ఆ ప్రకారం జిల్లాలో మొత్తం విద్యార్థుల సంఖ్య సుమారు 2.50 లక్షలకు చేరే అవకాశం ఉందని, దానికనుగుణంగానే అర్హులైన తల్లుల సంఖ్య పెరుగుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల తుదిగడువు పూర్తయిన వెంటనే ఈ పథకానికి అర్హులైన తల్లులను గుర్తించే ప్రక్రియను సచివాలయాల్లో చేపడతారు. జిల్లాలో ముగ్గురు పిల్లలు/విద్యార్థులున్న తల్లులు 1532 మందిగా గుర్తించిన ప్రభుత్వం ఆ మేరకు వారి డేటాను విద్యాశాఖకు పంపించింది. సంబంధిత విద్యార్థుల ఆధార్ కార్డులను నిశితంగా పరిశీలించి తల్లుల అర్హతలను పరిశీలిం చాలని మండలాల ఎంఈవోలను ఆదేశించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే నిర్ణీత మార్గదర్శ కాలకు లోబడి తల్లికి వందనం ఆర్థికసాయాన్ని అంద జేస్తున్నప్పటికీ, ఈ ఏడాది(2025-26) మొత్తం స్కూలు పనిదినాల్లో విద్యార్థి హాజరు 75శాతం ఉంటేనే 2026-27 విద్యాసంవత్సరంలో ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.



పాతూరులో కేక్ కట్ చేస్తున్న ఘంటా మురళి



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రోషన్ కుమార్



కొయ్యలగూడెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ప్రజా పాలనకు ఏడాది..

సంబరాలు నిర్వహించుకున్న టీడీపీ

ఏలూరు టూటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సామాన్యుల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యి ఏడాది పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మహేశ్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను క్రమపద్ధతిలో అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం, ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఇడా చైర్మన్ శివ ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి పాల్గొన్నారు.

● భీమడోలు: రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. గురువారం భీమడోలులో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా విజయోత్సవ యాత్రను నిర్వహించారు.

● ఏలూరు టూటౌన్: పోలవరం ప్రాజెక్టును రెండేళ్లలో పూర్తి చేస్తామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భారీ కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఇది ప్రజలకు మంచిచేసే ప్రభుత్వమని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి రేగంటి రాంబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని కేక్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏడాదిలో తమ ప్రభుత్వం అన్ని వర్గాలను ఆకట్టుకుందన్నారు.

● జంగారెడ్డిగూడెం: కాకర్ల కాంప్లెక్స్‌లో టీడీపీ ఏడాది పాలన వేడుకలను టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వేడుకల్లో టీడీపీ సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు, కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, రావూరి కృష్ణ,షేక్ ముస్తఫా, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, పాతూరి అంబేడ్కర్, బూరుగుపల్లి సూరిబాబు, అల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

● పెదవేగి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు తాతా సత్యనారాయణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నేతృత్వంలో ప్రజా సంక్షేమ పాలన నిర్వహిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు కంచెన మోహనరావు, వీరవల్లి సత్యనారాయణ, శ్రీనివాసరావు, రమేశ్ పాల్గొన్నారు.

● లింగపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిందని టీడీపీ మండలాధ్యక్షుడు గరిమళ్ల చలపతిరావు అన్నారు. ఈ సందర్భంగా లింగపాలెం మండలంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్, స్వీట్లు పంచారు. గుత్తా సత్యసాయి వరప్రసాద్, మోరంపూడి మల్లికార్జునరావు, ముసునూరి రాము, గారపాటి బుజ్జయ్య, మోరంపూడి వరప్రసాద్, చెరువుగట్టు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: సుపరిపాలనకు అంకురార్పణపడి ఏడాది పూర్తయిందని కూటమి నాయకులు పేర్కొన్నారు. విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొల్లు రమేశ్, అలుమోలు శ్రీనివాసరావు, మోదుగ రామారావు, వేములయ్య, రాంబాబు, హాసన నేని వెంకట్రావు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కొయ్యలగూడెం సెంటర్‌లో రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో నియోజకవర్గ పరిశీలకులు అనపర్తి వెంకటనారాయణ, మండలాధ్యక్షులు పారేపల్లి నరేశ్, టీడీపీ పట్టణాధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చిన రాజు, మేఘలాదేవి పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

● కామవరపుకోట: పాతూరులో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు కిలారు సత్యనారాయణ, ఘంటా సత్యంబాబు, వజీర్‌ఖాన్, దొడ్డాకుల గంగాధరరావు, కె.కృష్ణ, పసుమర్తి పార్థసారథి బాబు, వేముల హనుమంతు, పడిమి కొండచంటి, రెబ్బా పరాత్పరరావు, ఘంటాగోపి, బొల్లుబోయిన కల్యాణం, నల్లమిల్లి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు బంగ్లా వద్ద: స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ మండలాధ్యక్షులు ఏలూరి హరిరామకృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కోనేరు వెంకట సుబ్బారావు, ఘంటా సుధీర్ బాబు, నెక్కలపు సూర్యనారాయణ, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, కాకి చంటి, సూర్యనారాయణరాజు, బొంతు వెంకటేశ్వరరావు, పసుమర్తి పార్థసారథి బాబు, వి.నాగేశ్వరరావు, కోనేరు జయకృష్ణ, గంగాధరరావు, వల్లీ, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

● చింతలపూడి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడాది పాలనపై కూటమి నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి అభినందనలు తెలుపుకున్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర అంశాలపై చర్చించుకున్నారు. నాయకులు ఎ.ముత్తారెడ్డి, వెంకటరామయ్య, తాటి అప్పారావు, ధర్మరాజు, టీఎన్ఏ కుమార్, శేషగిరిరావు, భారతి పాల్గొన్నారు. ప్రగడవరంలోనూ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

● జంగారెడ్డిగూడెం : కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పంగిడిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగాల సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో వేడుకలు నిర్వహించారు.

ఘనంగా సామూహిక అక్షరభ్యాసాలు

అక్షరాలు దిద్దించిన అధికారులు
ఉత్సాహంగా స్కూళ్ల పునఃప్రారంభం
సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం



అక్షరభ్యాసం చేయిస్తున్న ఆర్డీవో రమణ

దెందులూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): దెందులూరు, కొవ్వలి, గాలాయగూడెంలో సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. దెందులూరులోని 14 అంగన్వాడీ సెంటర్లకు చెందిన చిన్నారులతో టీడీపీ నాయకులు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి వెంకటేశ్వరరావు యాదవ్, సెక్టార్ సూపర్ వైజర్ జె.చిట్టెమ్మ పాల్గొన్నారు. గాలాయగూడెంలో సెక్టార్ సూపర్ వైజర్ పద్మభూషణం, ఏఎంసీ డైరెక్టర్ మద్దా దయానందరాజు, పూజారి శ్రీనివాసరావు, ఏనుగు రామకృష్ణ, నాయకులతో కలిసి అక్షరభ్యాసం నిర్వహించారు. కొవ్వలిలో సెక్టార్ సూపర్ వైజర్ శ్రీదేవి టీడీపీ నాయకులతో కలిసి సామూహిక అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు.

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

దెందులూరులోని గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో సన్న బియ్యంతో ఆహారాన్ని అందించారు. దెందులూరు యోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, సర్పంచ్ తోట యేసమ్మ, హెచ్‌ఎం వడ్లపట్ల విజయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి వెంకటేశ్వరరావులతో కలిసి విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ బొత్స కనక కిశోర్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండల కేంద్రంలోని 5వ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ పిల్లలచేత సీడీపీవో యూఎన్‌వీ పద్మావతి అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో పలు కేంద్రాల్లో నూతనంగా చేరిన పిల్లలచేత సీడీపీవో తల్లులతో కలిసి అక్షరాభ్యాసం చేయించారు.

● జంగారెడ్డిగూడెం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్నారని ప్రజలంతా అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎం.వి.రమణ కోరారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రీ స్కూల్ పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో పి.బ్యూలా, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, టీచర్లు విజయ నిర్మల, శిరోమణి, కరీమున్నీసా పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలున్నాయని తహసీల్దార్ సాయిబాబా తెలిపారు.టి.నర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రధానోపాధ్యాయులు స్వామి, ఉపాధ్యాయులు నారాయణ, కుటుంబరావు, చైతన్య, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీహరిబాబు, వీఆర్వో ఫణి పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలంలో పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. మండలంలో ఉన్న 3,229 మంది విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను అందజేసేందుకు అన్నిపాఠశాలలకు సరఫరా చేసినట్టు ఎంఈవో కె.రామారావు తెలిపారు. ధర్మాజీగూడెం పాఠశాలలో విద్యార్థులకు కూటమి నాయకులు సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్లను అందజేశారు. గరిమళ్ల చలపతిరావు గుత్తాసత్యసాయి వరప్రసాద్, ఎం.మల్లికార్జునరావు, జి.బుజ్జయ్య, జి.వెంకటేశ్వరరావు మురళీ, నాగబాబు పాల్గొన్నారు.

ముడిచర్లలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న చిన్నారులకు ఐసీడీఎస్ సీడీపీవో మాధవి, సూపర్‌వైజర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ బడిబాటను నిర్వహించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, బడిలో చేరే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. సర్పంచ్ రావి రమాదేవి, అంగన్‌వాడీలు కల్పన, మానుష పాల్గొన్నారు.



సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే రోషన్

ఎమ్మెల్యే రోషన్ కృషితో పెట్టుబడులు

చింతలపూడి : యూకే నుంచి వచ్చిన పెట్టుబడిదారులతో చర్చలు సఫలమయ్యాయని ఎమ్మెల్యే రోషన్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలో రూ.2వేల కోట్లతో పెట్టుబడులు పెట్టడానికి సీఎం చంద్రబాబుతో చర్చలు జరిపామన్నారు. యూకే నుంచి వచ్చిన పెట్టుబడిదారులలో తనకు స్నేహబంధాలున్నాయని ఆ చొరవతోనే పెట్టుబడులకు ఆహ్వానించినట్టు తెలిపారు. వీరి పెట్టుబడులతో పదివేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.



చిన్నారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి : చిర్రి

కొయ్యలగూడెం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. గురువారం సరిపల్లిలోని ఎంవీఆర్ పాఠశాలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న ఆరుగురు విద్యార్థులను ఎమ్మెల్యే చిర్రిబాలరాజు సత్కరించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు అవార్డుకు ఎంపికవడం గర్వకారణమన్నారు. సరిపల్లి సర్పంచ్ తాడేపల్లి గోపి, ఎంవీఆర్ పాఠశాల కరస్పాండెంట్ మహేశ్, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, బయ్యనగూడెం నాయకుడు మద్దు బాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలి : రత్నప్రసాద్



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి) : బాలకార్మిక వ్యవస్థను రూపుమాపి, వీధి బాలలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఆదేశించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిప్యూటీ కమిషనరు ఆఫ్ లేబర్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్)సంయుక్తంగా బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఏలూరు ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించడం జరిగిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలిపారు. తదనంతరం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో సంబంధిత అధికారులు, మహిళా పోలీసులు, మహిళలు, విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రజలను ఎంతో చైతన్య వంతం చేసినా ఎక్కడో ఒకచోట బాల కార్మిక వ్యవస్థ ఉంటుందన్నారు. డ్రాఫ్‌అవుట్ విద్యార్థిని, విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలకు పంపించే ఏర్పాట్లు చేయాలని రత్న ప్రసాద్ సూచించారు. ఈ జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ.రాణి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కెకృష్ణమూర్తి, అసిస్టెంట్ కమిషన్ ఆఫ్ లేబర్ జి.నాగేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కాంతిప్రియ, చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ రవి, వినోద్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని తహసీల్దారు కె.స్లీవ జోజి సూచించారు. గురువారం పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా జడ్పీ బాలుర హైస్కూల్, బాలికల బాలికల హైస్కూల్లో మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. డీటీ (రీసర్వే)రమేశ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భోజనాలు తనిఖీ చేసిన తహసీల్దార్

చింతలపూడి: మేడబడి పాఠశాలలో సన్నబియ్యం భోజనాన్ని తహసీల్దార్ ప్రమద్వర పరిశీలించారు. పాఠశాలలను తెరిచిన సందర్భంగా తొలిరోజు డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం పథకానికి సన్నబియ్యం ఇచ్చినట్టు తెలిపారు. వెలగలపల్లి పాఠశాలను కూడా పరిశీలించారు. అలాగే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ షకీలున్నీసా పాల్గొన్నారు.

ఆక్వాజోన్‌ల రీ సర్వేపై గ్రామ సభలు

ఉంగుటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ఆక్వా జోన్‌ల నిర్ధారణలో భాగంగా గురువారం రీ సర్వేను పురస్కరించుకుని పలు గ్రామాల్లో సభలు నిర్వహించారు. మండలంలోని రాచూరు, రావులపర్రు, కాగుపాడు, చేబ్రోలు, కైకరం గ్రామాల్లో ఈ సభలు జరిగాయి. అయితే ఈ సభల్లో ఆక్వా రైతులు కనిపించకపోవడం విశేషం. కాగా ఆయా సమావేశాల్లో రైతుల కంటే అనధికార వ్యక్తులు హాజరవడం గమనార్హం. సమావేశాల్లో ముఖ్యఅతిథిగా బాదంపూడి ఎడీవో మంగారావు, కైకరం ఫిషరీస్ అసిస్టెంట్ సుధీర్ పాల్గొని రైతులకు నాన్ ఆక్వా జోన్ నుంచి ఆక్వా జోన్‌గా మా ర్చేందుకుగాను జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ గురించి వివరించారు.

తహసీల్దార్‌గా నాగరాజు బాధ్యతలు



కొయ్యలగూడెం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెం తహసీల్దార్‌గా నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న చెల్లన్నదొర బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు స్వీకరించిన నాగరాజును రెవెన్యూ సిబ్బంది, జనసేన నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మండలంలోని ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉంటానని తెలిపారు.

విమాన ప్రమాదంపై ఎంపీ దిగ్భ్రాంతి

ఏలూరుటూటౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనపై ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తీవ్ర దిగ్భ్రంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ఓ ప్రకటనలో సానుభూతిని తెలిపారు. ఈ ప్రమాదంలో మెడికల్ కళాశాల విద్యార్థులు కూడా ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమన్నారు.

సాగులో మెలకువలపై అవగాహన

ఉంగుటూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): వికసిత్ కృషి అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులు ఆయిల్ పాం సాగు విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, మెలకువలపై గురువారం అవగాహన కల్పించారు. బాదంపూడిలో ఆయిల్‌పాం సాగును ప్రధాన శాస్త్రవేత్త డి.మేరీ రాణి పరిశీలించారు. సేంద్రియ సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. మండల వ్యవసాయాధికారి డా.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భూగర్భ జలాలు నీటి కాలువలు కలుషితం కాకుండా చూడాలన్నారు. గ్రామ వి.ఏ.ఏ.శ్రీలక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



భూముల సమస్యపై వినతి

కుక్కునూరు, జూన్12(ఆంధ్రజ్యోతి):ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా 41.15 కాంటూరు లెవెల్లో భూములకు సంబంధించిన సమస్యలపై సీపీఎం మండల నాయకులు తహసీల్దార్ రమేశ్ బాబుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ముడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు వై.నాగేంద్రరావు, మండల కార్యదర్శి బుయ్యన శ్రీను, లక్ష్మయ్య, మేడిపల్లి బాబు, వలి భాష, రమేశ్, ఎ.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్‌గన్‌తో తనిఖీలు

ఏలూరు క్రైం, జూన్ 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం జాతీయ రహదారిపై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి స్పీడ్ గన్‌లతో పోలీసులు గురువారం తనిఖీలు చేపట్టారు. రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, డీటీఆర్‌బీ మధు, రోడ్డు సేఫ్టీ సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. 16వ నెంబర్ జాతీయ రహదారిపై ఆశ్రం ఆస్పత్రి వద్ద స్పీడు కెమెరాలను పెట్టి వాహనాల వేగాన్ని గుర్తించారు. అతి వేగంగా వెళ్తున్న 30 వాహనాలను స్పీట్ హంటర్ పరికరం ద్వారా గుర్తించి రూ.35 వేల జరిమానా విధించారు.


విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు

టి.నర్సాపురం, జూన్12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని జంగారెడ్డిగూడెం ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు. 13 నుంచి 20వ తేదీ వరకు టి.నర్సాపురం సబ్‌స్టేషన్ పరిధిలో తీగలవన్స, ఎన్‌టీఆర్‌గూడెం పరిధిలోని, ఆర్‌కేఆర్‌గూడెం ఫీడర్ పరిధిలోని ముత్యాలమ్మపేట, గండిగూడెం ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్టు తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులుంటాయని ఆయన తెలిపారు.


నేడు విద్యుత్ నిలిచిపోయే ప్రాంతాలు

జీలుగుమిల్లి: జీలుగుమిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల సందర్భంగా శుక్రవారం జీలుగుమిల్లి, తాటియాకులగూడెం, చంద్రమ్మకాలనీ, బర్రింకలపాడు, దాట్లవారిగూడెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఉదయం 8నుంచి 12 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు అహ్మద్‌ఖాన్ తెలిపారు.

సీసీఎస్ సీఐగా వెంకటేశ్వరరావు



ఏలూరు క్రైం, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో ఉన్న సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఇన్ స్పెక్టర్‌గా కె.వెంకటేశ్వరరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. పెదవేగి సీఐగా పనిచేస్తున్న ఆయన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏలూరు సీసీఎస్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో చోరీ కేసుల దర్యాప్తుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక చర్యలు చేపట్టి త్వరితగతిన బాధితులకు న్యాయం చేయడానికి, పోయిన సొత్తును రికవరీ చేయడానికి కృషి చేస్తానని తెలిపారు.



టీడీపీ కార్యకర్తకు నగదు సాయం

జీలుగుమిల్లి: లక్ష్మీపురానికి చెందిన టీడీపీ కార్యకర్త పరసా వెంకటేశ్వరావు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. గుంటూరు కిమ్స్‌మ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న వెంకటేశ్వరావును టీడీపీ కార్యకర్తలు పారామర్శించి నగదు సాయం అందజేశారు.

వట్టిగుడిపాడులో న్యాయ విజ్ఞాన సదస్సు

ఆగిరిపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వట్టిగుడిపాడు గ్రామంలో మోహన్ స్పింటెక్స్ ఫ్యాక్టరీ ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు గురువారం నిర్వహించారు. సదస్సులో మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఒ.అనూష ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా బాల కార్మిక వ్యవస్థ నిరోధక చట్టం ఆవశ్యకతను ఆమె వివరించారు. లేబర్ ఆఫీసర్ కె.శ్యాంబాబు, న్యాయవాదులు బసవరాజు రామకృష్ణ, ఎస్‌కేడీ ప్రసాద రావు, మురాళ్ళ గోపీనాథ్, మేనేజింగ్ డైరెక్టర్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.



కాకరవాడలో నీట మునిగిన వెదజల్లిన వరి విత్తనాల మడులు

ముంపు బారిన వరి పొలాలు

» భారీ వర్షంతో స్తంభించిన బోదెలు
» నీట మునిగిన వెదజల్లిన విత్తనాలు
» ఆందోళనలో రైతులు

ముదినేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ముదినేపల్లి మండలంలో ఖరీఫ్ సీజన్‌కు వెదజల్లిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. నైరుతి రుతుపవనాలు సమీపిస్తున్న కారణంగా పలు గ్రామాల్లో రైతులు ఈనెల 8, 9 తేదీల్లో సార్వా వరి విత్తనాలను వెదజల్లారు. మరుసటి రోజు మంగళవారం రాత్రి భారీవర్షం కురవడంతో పొలాల్లో పెద్దఎత్తున నీరు నిలిచాయి. ముదినేపల్లి, చినపాలపర్రు, కాకరవాడ తదితర గ్రామాల్లో వెదజల్లిన వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. మైనర్ డ్రెయిన్లు, పొలాల మధ్యలో ఉండే మురుగు బోదెలు స్తంభించిపోవడంతో ముంపు నీరు తగ్గడం లేదు. వెదజల్లిన వరి విత్తనాలు పాడైపోతాయోమోనన్న భయం రైతుల్లో నెలకొంది.

నూజివీడును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

» రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు/ఆగిరిపల్లి/చాట్రాయి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. పట్టణంలో రూ.5 కోట్లతో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 26వ వార్డు సీసీ రహదారి నిర్మాణ కార్యక్రమానికి శంకుస్థాపన చేశారు. పట్టణంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇండోర్ స్టేడియానికి మోక్షం లభించింది. రూ.2.75 కోట్లతో చేపట్టే స్టేడియం పునఃనిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేసిందన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు. ఆగిరిపల్లి మండల ఈదర హైస్కూల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. పాఠశాలల ప్రారంభం రోజే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పేరుతో తొమ్మిది రకాల వస్తువులతో కిట్లు పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు చేసిందన్నారు. జిల్లాలో విద్యార్థులకు సరఫరా చేసేందుకు పాఠ్యపుస్తకాలు, 7,62,338 రాత పుస్తకాలు ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. చాట్రాయి మండలం చాట్రాయి పోలీస్‌స్టేషన్ సమీపంలో కాలువ గట్టుపై ఉన్న ఇల్లు ఈనెల 8వ తేదీన వచ్చిన గాలి వానకు కూలిపోయి నిరాశ్రయులైన పేద కుటుంబానికి పక్కా ఇల్లు మంజూరు చేయాలని మంత్రి పార్థసారథి కలెక్టర్‌ను ఆదేశించారు. కాలువ గట్టుపై పూరిల్లు నిర్మించుకున్న పత్తిపాటి రంగా, శ్రావణ సంధ్య దంపతులు, ముగ్గురు పిల్లలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. గాలివానకు ఇంటి పక్కన ఉన్న పెద్ద వేప చెట్టు కూలి ఇంటిపై పడి పూర్తిగా ఇల్లు ధ్వంసమైంది. మంత్రి వ్యక్తిగతంగా బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. తహసీల్దార్ ఈశ్వరరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు గడ్డం ప్రభాకరరెడ్డి, కంచర్ల హనుమంతరావు తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమా దం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మంత్రి పార్థసారథి అన్నారు. ప్రమాదంలో 35మందికిపైగా మెడికల్ విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం శోచనీయమన్నారు.

విద్యుత్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం

ఆగిరిపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అదాలత్ ద్వారా వినియోగదారుల సమస్యలు పరిష్కరిస్తామని రిటైర్డ్ జిల్లా సెషన్స్ న్యాయవాధికారి, సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ అన్నారు. గురువారం ఆగిరిపల్లి పొన్నం కల్యాణ మండపంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సత్యనారాయణ ఆధ్వర్యంలో 'విద్యుత్ అదాలత్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహాల విద్యుత్ బిల్లులు, మీటర్ల లోపాలు, వాణిజ్య సమస్యలు, వ్యవసాయ మోటార్‌కు సంబంధించిన కరెంటు సమస్యలపై వినియోగదారుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించామని తెలిపారు. విద్యుత్ అదాలత్‌లో మొత్తం ఏడు అర్జీలు రాగా, అందులో రెండు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించామన్నారు. సీజీఆర్‌ఎఫ్ సాంకేతిక సభ్యులు ఎస్. శ్రీనివాసరావు, ఆర్థిక సమస్యలు సీహెచ్ శ్రీనివాసరావు, సునీత, పాల్గొన్నారు.





నెక్కలం గొల్లగూడెంలో బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి.. కైకలూరు, చనుబండల్లో కేక్‌లు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

» ఏడాది పాలనలోనే ఎన్నో విజయాలు సాధించాం : మంత్రి పార్థసారథి » ఉత్సాహంగా టీడీపీ సంబరాలు

ఆగిరిపల్లి/చాట్రాయి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఏడాది పాలనలోనే ఎన్నో విజయాలు సాధించామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆగిరిపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. నెక్కలం గొల్లగూడెంలో ఎంపీ లాడ్స్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించే బీసీ కమ్యూనిటీ హాల్, నాబార్డు నిధులు రూ.1.50 కోట్లతో ఈదర నుంచి శోభనాపురం రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు నియోజకవర్గంలో జడ్పీ పరిధిలో రూ.3.55 కోట్లతో రహదారులు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో ఏడాది కాలంలో రూ.170 కోట్లు భరోసా పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీవో బి.భార్గవి, టీడీపీ అధ్యక్షుడు నక్కనబోయిన వేణు, నరదల రాంబాబు, ఈదర సర్పంచ్ దొండపాటి ఏసుపాదం, కోటగిరి మోహనరావు, నలజాల హరిబాబు, పి.శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు జీఆర్‌కే రంగారావు, చిట్టిబాబు, డి.వెంకటేశ్వరావు, కొవ్వలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలంలో చనుబండ, జనార్ధనవరం గ్రామాల్లో గురువారం టీడీపీ శ్రేణులు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరిపారు. తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు మాదాసు చంద్రకళ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. నాయకులు నక్కా రాము, జక్కంపూడి ప్రదీప్, పరసా శ్రీను, బొంతు సతీష్, బలుపూరి రత్తయ, నాయకులు పాల్గొన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'

ముదినేపల్లి/మండవల్లి : కూటమి పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరిట ముదినేపల్లి మండలం బొమ్మినంపాడులో తెలుగుదేశం, జనసేన నాయకులు సంబరాలు నిర్వహించారు. ఏడాది పాలనపై కేక్ కట్ చేశారు. టీడీపీ మండల ఉపాధ్యక్షుడు యర్రా రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కేనం ప్రసాద్, టీడీపీ నాయకులు దాసరి శ్రీనివాసరావు, బోయిన నాగు, మోజెస్, కోట జగన్, నవీన్, జనసేన నాయకుడు బాసిన శెట్టి కిశోర్ పాల్గొన్నారు. మండవల్లి మండలం భైరవపట్నంలో టీడీపీ సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, కేక్‌లు కట్ చేసి ఒకరిని ఒకరు తినిపించుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, నజ్జా సరేష్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలనను అంతమొందించి, ప్రజాప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని తెలిపారు.




బొమ్మినంపాడులో టీడీపీ, జనసేన నాయకుల సంబరాలు.. భైరవపట్నంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కైకలూరులో టీడీపీ సంబరాలు

కైకలూరు : జగన్మోహన్‌రెడ్డి రాక్షసపాలన పోయి ఏడాది కాలంగా ప్రజలు సుపరిపాలనలో స్వేచ్ఛగా జీవిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ పీరమల్లు నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. గురువారం కైకలూరులో తాలుకా సెంటర్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి సుపరిపాలనలో మొదటి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. అంబేద్కర్, దివంగత నాయకుడు ఎన్టీఆర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి అనంతరం కేక్ కట్ చేశారు. బాణాసంచా కాలుస్తూ ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు పీజేఎస్ మాల్యాద్రి, కొడాలి వినోద్, అంద్రాజు శ్రీనివాసరావు, లంకా రత్నారావు, పార్టీ మడల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, నారగాని కొండా, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాసచౌదరి, రాష్ట్ర తెలుగుయువత నాయకులు పూల రామచంద్రరావు, డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజు, మహిళా నాయకురాలు పోలవరపు లక్ష్మీరాణి, గంగుల శ్రీదేవి, దారం సుధా, వైస్ ఎంపీపీలు మంగినేని రామకృష్ణ, గంగుల వెంకటనరసమ్మ, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

కలిదిండి, జూన్12(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎంపీపీలు టీడీపీ సీనియర్ నాయకులు వలవల వెంకటరామారావు, చెన్నంశెట్టి మురళీకృష్ణ అన్నారు. గురువారం కోరుకొల్లులో వ్యవసాయ అధికారులతో కలిసి సబ్సిడీ వరి విత్తనాలను పంపిణీ చేశారు. కిలోకి రూ.5 సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వరి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోరుకొల్లు సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ, కూటమి నాయకులు ఆమజాల బాబులు, చెన్నంశెట్టి శ్రీనివాసరావు, బట్టు మహేష్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు విడుదల

ముదినేపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు ఈ ఏడాది ఏప్రిల్, మే నెలలకు సంబంధించి ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదలయ్యాయి. ముదినేపల్లి మండలంలోని ఉపాధి కూలీలకు ఏప్రిల్ 12 వరకు వేతనాలు చెల్లించగా, మే నెలాఖరు వరకు చెల్లింపులు జరగలేదు. మండలంలో సుమారు తొమ్మిది వేల మంది జాబ్ కార్డు హోల్డర్లకు మే 31 వరకు వేతనాలు గురువారం నుంచి వారి బ్యాంక్ ఖాతాలకు జమ అవుతున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ మండల ఏపీవో హేమంత్ కుమార్ తెలిపారు. ఈనెల 16 నాటికి ఉపాధి కూలీలందరికి పెండింగ్ వేతనాలు చెల్లింపులు జరుగుతాయన్నారు.




గొల్లపల్లిలో పాఠశాలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్.. కైకలూరు ప్రభుత్వ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం

నాణ్యమైన భోజనం అందించాలి : సబ్ కలెక్టర్

నూజివీడు టౌన్/ముసునూరు/కలిదిండి/చాట్రాయి/ కైకలూరు, జూన్ 12 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ ఆదేశిం చారు. గొల్లపల్లిలో అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక పరిశీలన చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌రూమ్, వంటశాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్న బియ్యాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.శారద, ఉపాధ్యాయులు పి.రవీంద్ర, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ముసునూరు మండలం ముసునూరు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యిర్మీయా అన్నారు. ముసునూరు ఏస్సీ బాలికల వసతిగృహం, జడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో బి.వి.ఎస్ సుబ్బారావు, ఎస్‌ఎంసీ చైర్మన్ నక్కా యోహానులతో కలిసి ఆమె ప్రారంభించారు. సన్నబియ్యంతో తయారు చేసిన భోజనాన్ని విద్యార్థులకు వారు వడ్డించారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్, ఉపసర్పంచ్ తోట శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ వైస్ చైర్మన్ దీప్తి, హెచ్‌ఎం డి.శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కలిదిండి మండలం కలిదిండి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో వెలమల శ్రీనివాసరావు పరిశీలించారు. చాట్రాయి మండలం చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తొలి రోజు 907 మంది హాజరుకాగా 905 మంది భోజనం చేశారన్నారు. కైకలూరులోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం పరిశీలించారు. విద్యార్థులకు వండిన ఆహారాన్ని రుచి చూసి పలు సూచనలు చేశారు.

తల్లి తబ్బిబ్బయ్యేలా..

(మూడో పేజీ తరువాయి)

విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. తల్లికి వందనం ఆర్థిక సాయానికి ప్రస్తుతం జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలతో పాటు, అన్ని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల సంఖ్య 2,15,082గా ధ్రువపడింది. తల్లుల సంఖ్య 1,40,764గా తేల్చారు. ఇప్పుడు ఆర్థికసాయానికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన తల్లుల సంఖ్యను సచివాలయాలు గుర్తించాల్సి ఉంటుంది. మరోవైపు ఒకటో తరగతిలోకి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోకి అడ్మి షన్లు తీసుకున్న విద్యార్థుల సంఖ్యను తల్లికి వందనం పథకా నికి జోడించాల్సిఉంటుంది. ఈ రెండు తరగతుల్లోకి ఈ ఏడాది జరిగే అడ్మిషన్ల సంఖ్య దాదాపు 35 వేల వరకు ఉండవచ్చని ఆ ప్రకారం జిల్లాలో మొత్తం విద్యార్థుల సంఖ్య సుమారు 2.50 లక్షలకు చేరే అవకాశం ఉందని, దానికనుగుణంగానే అర్హులైన తల్లుల సంఖ్య పెరుగుతుందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఒకటో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్ల తుదిగడువు పూర్తయిన వెంటనే ఈ పథకానికి అర్హులైన తల్లులను గుర్తించే ప్రక్రియను సచివాలయాల్లో చేపడతారు.

జిల్లాలో ముగ్గురు పిల్లలున్న తల్లులు 1,532 మంది

జిల్లాలో ముగ్గురు పిల్లలు/విద్యార్థులున్న తల్లులు 1532 మందిగా గుర్తించిన ప్రభుత్వం ఆ మేరకు వారి డేటాను విద్యాశాఖకు పంపించింది. సంబంధిత విద్యార్థుల ఆధార్ కార్డులను నిశితంగా పరిశీలించి తల్లుల అర్హతలను పరిశీలించాలని మండలాల ఎంఈవోలను ఆదేశించింది.

ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే నిర్ణీత మార్గదర్శ కాలకు లోబడి తల్లికి వందనం ఆర్థికసాయాన్ని అంద జేస్తున్నప్పటికీ, ఈ ఏడాది(2025-26) మొత్తం స్కూలు పనిదినాల్లో విద్యార్థి హాజరు 75శాతం ఉంటేనే 2026-27 విద్యాసంవత్సరంలో ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

మండవల్లి జూన్ 12(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతుకు, భూమికి ప్రయోజనం చేకూరుతుందని, నాణ్యమైన దిగుబడులు సాధ్యమని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటేష్ తెలిపారు. గురువారం అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయం పంట పొలాలు ఆయన పరిశీలించారు. అధిక ఎరువులు పురుగుమందులు వాడకంతో పొలాలు చౌడు బారుతున్నాయని, దాన్ని తగ్గించేందుకు పచ్చిరొట్టలను పెంచుకోవాలిన సూచించారు. దీనివల్ల భూమిలో సూక్ష్మ పోషకాలు పెరిగి చౌడు తగ్గుతుందన్నారు. జిల్లా కో-ఆర్డినేటర్, ట్రైనర్ మధుబాబు, మాస్టర్ ట్రైనర్ ఆగస్టిన్, యూనిట్ ఇన్‌చార్జి నాగవిజయ, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

కలిదిండి, జూన్ 12(ఆంధ్రజ్యోతి):ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.బలరామ్, జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలిదిండి ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఆక్వా రంగం ద్వారా విదేశీ మారక ద్రవ్యం వస్తున్నప్పటికీ ఆక్వా మేతలు, మందుల ధరలు అధికంగా ఉండడం రొయ్యకు గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు నష్టాల బారిన పడుతున్నారన్నారు. విద్యుత్ సబ్సిడీలు అందించి రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. సీపీఎం నాయకులు శేషపు మహంకాళీరావు, జక్కుల మహేష్, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు మార్గదర్శకుడిగా ఉంటా



ఆర్థిక పరిస్థితులు తెలుసుకుంటున్న నితిన్ కృష్ణ

ఆగిరిపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 కార్యక్రమంలో భాగంగా 22 బంగారు కుటుంబాలకు మార్గదర్శకుడిగా ఉంటూ అభివృద్ధి పథంలోకి తీసుకువస్తానని నితిన్‌కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్‌కృష్ణ తెలిపారు. గురువారం అమ్మవారిగూడెంలో ఆయన మాట్లాడుతూ తాను దత్తత తీసుకునే కుటుంబాలను కలిసి వారి ఆర్థిక పరిస్థితులు, విద్య అభ్యసించే పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఏ వృత్తిలో నైపుణ్యం ఉందో తెలుసుకుని, అందుకు అనుగుణంగా చేయతనిస్తానన్నారు. నితిన్ కృష్ణ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించి, వారికి బంగారు భవిష్యత్ అందిస్తామన్నారు. తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, ఎంపీడీవో డి.భార్గవి, చౌటపల్లి విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న సన్నిధికి కాలినడకన మర్లపాలెం భక్తులు

చాట్రాయి, జూన్ 12(ఆంధ్రజ్యోతి):మర్లపాలెం రామాలయం నుంచి 15 మంది భక్తుల బృందం గురువారం ఉదయం వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి కాలినడకన బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యలో వున్న ఆలయాలను దర్శించుకుంటూ శనివారానికి వాడపల్లి చేరుకుని స్వామికి మొక్కులు చెల్లించుకుంటామని బృందం సభ్యుడు, మర్లపాలెం ఉప సర్పంచ్ వెల్ది రాజారావు తెలిపారు.

ముదినేపల్లి తహసీల్దార్‌గా లతీఫ్ పాషా

ముదినేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండల తహసీల్దార్‌గా షేక్ లతీఫ్‌పాషా నియమితులయ్యారు. కృష్ణా జిల్లా మచిలీపట్టణం రెవెన్యూ డివిజినల్ పరిపాలనాధికారిగా వ్యవహరిస్తున్న ఆయనను ఏలూరు జిల్లాకు కేటాయించగా, రెండు నెలలుగా ఖాళీగా ఉన్న ముదినేపల్లి మండలం తహసీల్దార్‌గా పాషాను నియమిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఆయన ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు.

సహకార వ్యవస్థ బలోపేతంతోనే ఆర్థిక అంతరాల తగ్గింపు



మాట్లాడుతున్న చైర్మన్ రాఘవేంద్రరావు

నూజివీడు టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతల తగ్గింపునకు సహకార వ్యవస్థ బలోపేతమే పరిష్కారమని విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిడెట్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. నూజివీడు బ్యాంక్ స్ట్రీట్‌లో బ్యాంకు 56వ నూతన శాఖ ప్రారంభోత్సవం సందర్భంగా గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో 1916లో ప్రారంభమైన విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ నూట పది సంవత్సరాల ఘన చరిత్ర కలిగిందన్నారు. ఇప్పటికే గన్నవరం, విజయవాడ బ్రాంచ్‌ల ద్వారా నూజివీడు ప్రాంతాలకు చెందిన 72 మందిపైగా రూ.8,44,500 మూలధనంతో బ్యాంక్ ప్రగతికి భాగస్వాములయ్యారన్నారు. మూడు కోట్ల మేర రుణాలు అందించినట్లు ఆయన తెలిపారు. విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్లు ప్రొఫెసర్ సన్నపనేని అంజయ్య, చిన్నం కోటేశ్వరరావు, ముఖ్య కార్యనిర్వాహక అధికారిణి వీవీబీ లక్ష్మి, డిప్యూటీ సీఈవో ఎంవీ కుమార్, విజయవాడ జోనల్ మేనేజర్ ఎస్‌ఆర్ మూర్తి, నూజివీడు బీఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు



కొన్నంగుంట చెరువు నుంచి తరలిస్తున్న మట్టి

నూజివీడు టౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు బేఖాతరు చేస్తూ నూజివీడు మండలంలో పలు గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు చేస్తున్నారు.మండలంలోని కొన్నంగుంటతోపాటు, పలు గ్రామాల నుంచి మట్టి అక్రమ తోలకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం గ్రామాలలోని పొలాలను సారవంతం చేసుకునేందుకు లేదా నివాస స్థలాల మేరువాకు మాత్రమే ఆయా గ్రామ పరిధిలో మట్టి తోలకాలను అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో చెరువుల్లో ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసుకుని వందలాది ట్రాక్టర్లతో మట్టి తోలకాలను కొనసాగిస్తున్నారు. అదే గ్రామంలో పేదలు నివాస స్థలాల మేరువాలకు మాత్రం మొండిచేయి చూపుతున్నారు. దీనిపై మండల స్థాయి అధికారులు సైతం కనీసం దృష్టి సారించడం లేదని ఆయా గ్రామాల వాసులు వాపోతున్నారు.

'మన అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీలు



చింతలవల్లిలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ

ముసునూరు/కైకలూరు/కలిదిండి/ముదినేపల్లి/ఆగిరిపల్లి, జూన్ 12(ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలోని పలు గ్రామాల్లో 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీలను గురువారం నిర్వహించారు. చింతలవల్లి, చెక్కపల్లి, సింహాద్రిపురం గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు సంయుక్తంగా ర్యాలీలు నిర్వహించారు. చింతవల్లిలో కార్యకర్త పల్లిపాము రాజకుమారి ఆధ్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ రెండేళ్ల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో జాయిన్ చేయాలని తల్లులను కోరారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు తదితరులు పాల్గొన్నారు. కైకలూరు పట్టణంలోని 16వ వార్డు వెలమపేట కాలనీలో సీడీపీవో దీప్తి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్యామలగౌరి, అంగన్‌వాడీ టీచర్లు కల్యాణి, ఉషా, గౌరి పాల్గొన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లులో సర్పంచ్ బట్టు లీలాకనకదుర్గ ఆధ్వర్యంలో ఎనిమిది అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయిం చారు. ముదినేపల్లి మండలంలో ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు అధికారిణి దీప్తి ఆధ్వర్యంలో సూపర్‌వైజర్లు బి.విజయలక్ష్మి, సుందరమ్మ, అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు గ్రామాల్లో అంగన్‌వాడీలకు 'రండి' అనే నినాదాలతో ర్యాలీలు నిర్వహించి కేంద్రాల్లో పిల్లలకు అక్షరాభ్యాసం జరిపారు. ఆగిరిపల్లి మండలం అరిగిపల్లి, సగ్గురు గ్రామాల్లో అంగన్‌వాడీ పిలుస్తుంది కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ జి.రాగమయి ఆధ్వర్యంలో మడేళ్లు నిండిన పిల్లలను ప్రీస్కూల్‌కు జాయిన్ చేసుకున్నామని తెలిపారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

కలిదిండి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లల తల్లులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. గంటల తరబడి విద్యుత్‌కోత విధిస్తుండడంతో చేతి వృత్తులు చేసుకునే వ్యాపారులు సైతం అవస్థలు పడుతున్నారు. రొయ్యల చెరువుల్లో నిరంతరాయంగా తిరగాల్సిన ఏరియేటర్లు విద్యుత్ కోతతో తిరగడం ఆగిపోతున్నాయి. చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడి రొయ్యలు చనిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లుతుందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది రైతులు అధిక వ్యయంతో అద్దె జనరేటర్లతో ఏరియేటర్లను తిప్పుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలను ఎత్తేయాలని ప్రజలు కోరుతున్నారు.

సూరేపల్లి పంచాయతీకి వాటర్ ప్లాంట్ వితరణ

ముసునూరు, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సూరేపల్లి గ్రామ పంచాయతీకి ఓబిళ్ళనేని వెంకటరత్నం తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను వితరణ చేశారు. గురువారం దాత, నాయకులు సంయుక్తంగా ప్లాంట్‌కు సంబంధించిన బోరులో విద్యుత్ మోటారును బిగించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు మల్లిబాబు మాట్లాడుతూ ఈ ప్లాంట్ వల్ల గ్రామస్థులకు మినరల్ వాటర్ కష్టాలు తీరుతాయన్నారు. ఈ సందర్భంగా వెంకటరత్నాన్ని నాయకులు అభినందించారు. వార్డు సభ్యులు కొక్కరపాటి శోభనాద్రి, రామకృష్ణ, వడ్లపట్ల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు కార్యదర్శుల నియామకాలు

ముదినేపల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను నియమిస్తూ ఒక గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో బదిలీ చేస్తూ కలెక్టర్ డీకే బాలాజీ ఉత్తర్వులు జారీ చేశారు. ముదినేపల్లి మండలంలోని వైవాక పంచాయతీ కార్యదర్శిగా ముసునూరి మండలం రమణక్కపేట కార్యదర్శి పి.నాగబాబును చేవూరు పంచాయతీ కార్యదర్శిగా కంచికచర్ల మండలం మొగులూరు పంచాయతీ కార్యదర్శి కె. సంగమయ్యను నియమించారు. మండలంలోని పెయ్యేరు పంచాయతీ కార్యదర్శి జి. రమేష్‌ను గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు పంచాయతీ కార్యదర్శిగా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.